ఆదివారం
ప్రజాశక్తి
సెప్టెంబర్ 15, 2002

ఇరాక్‌పై కోరలు చాస్తున్న అమెరికా

హ్యాపీ బర్త్‌డే

(15-9-2002 నుండి 21-9-2002 వరకు)

కె. చేతన
సెప్టెంబర్ 15
చంద్రకళ-శేఖర్
కవాడీగూడ-సికింద్రాబాద్

మేరీ రత్నం
2సం॥, 15.9.2000
సునీతరత్నం-యేసురత్నం
కాతేరు-రాజమండ్రి

సోమేపల్లి కావ్య
8సం॥, 15.9.1994
అనంతలక్ష్మి-హనుమంతరావు
అద్దంకి-ప్రకాశం జిల్లా

పి.ఎన్. హారిణి
2సం॥, 15.9.2000
సుకన్య-నర్సింహ్మ
మారుతీనగర్-హైదరాబాద్

ఆర్. అజయ్‌కాంత్
8సం॥, 15.9.1994
జ్యోతిరాణి-కోటేశ్వరరావు
పాలపర్రు-గుంటూరు జిల్లా

వంశీకృష్ణ
2సం॥, 16.9.2000
అనసూర్య-కోటేశ్వరరావు
రొంపిచర్ల

కె. చంద్రికా చౌదరి
సెప్టెంబర్ 16
శ్యామలాదేవి-వెంకట్రావ్
బాపట్ల-గుంటూరు జిల్లా

వికాశ్
2సం॥, 16.9.2000
రాజేశ్వరి-సురేష్‌కుమార్
అలంపూర్

ఎం. చైతన్య
8సం॥, 17.9.1994
శ్రీలక్ష్మి-సత్యనారాయణ
భట్టిప్రోలు, గుంటూరు జిల్లా

చిగురుపాటి ప్రభాత్
4సం॥, 17.9.1998
సునంద-బాబూరావు
విజయవాడ

హర్షితారాయ్
1సం॥, 17.9.2001
చంద్రవేణి-అప్పారావు
గాజువాక-వైజాగ్

వట్టికొండ స్ఫూర్తి
4సం॥, 18.9.1998
ఉష-వెంకట్రావ్
వైరా-ఖమ్మం జిల్లా

దివి వెంకట మానస
4సం॥, 18.9.1998
రఘు-జయశ్రీ
భట్టిప్రోలు

రాకేష్ కుమార్
సెప్టెంబర్ 19
చంద్రకళ-కిషన్
బోధన్

కిషోర్ కుమార్
2సం॥, 20.9.2000
ముత్యాలమ్మ-శ్రీనివాసులు
చెన్నేకొత్తపల్లి-అనంతపురం జిల్లా

వి. స్వేచ్ఛ
1సం॥, 20.9.2001
బిందు-ప్రసాద్
కమలాపురం-వరంగల్ జిల్లా

భట్టిప్రోలు కార్తికేయ
సెప్టెంబర్ 21
మంజుల-వేణు
ఖమ్మం



అనుకూల పరిస్థితులు ఉండవు. అందుచేత నిల్వ ఉన్న ఆహార పదార్థాపు అణువులు అక్కడ కుళ్ళి, నోటిలో నివశించే వేలాది బాక్టీరియాల చర్యలకు గురై చిగురు వ్యాధిగ్రస్తం కావడం జరుగుతుంది.

ఇబ్బందులు : పంటిచుట్టూతా ఉండే చిగురు వాస్తుంది. ఇలా కావడాన్ని 'పెరికార్నయిటిస్' అంటారు. వ్యాధి దవడను చేరి, దవడవాపుకు దారి తీస్తుంది. చీము పట్టి విపరీతమైన నొప్పి కలుగుతుంది. తీవ్ర స్థాయిలో జ్వరం రావడం, ఆహారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడడం, తద్వారా నీరసించి పోవడం జరుగుతుంది. దవడ కింద 'లింపుగ్రంధులు' వాచి భరించలేని నొప్పి కలుగుతుంది. ఈ స్థాయిలో సైతం అశ్రద్ధ జరిగితే, నోరు మూసుకుపోవడం, నోటి నుండి దుర్వాసన వెలువడడం, కనీసం మంచి నీటిని సైతం మింగలేని దుస్థితి ఏర్పడుతుంది.

చికిత్సా విధానాలు

దీని చికిత్సలో రెండు ముఖ్యమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. (1) ఔషధ చికిత్స (2) శస్త్రచికిత్స.

ఔషధ చికిత్సకు సంబంధించి, వ్యాధి నిరోధక మందులు, బాధా నివారణ మందులు, విటమినులు వాడడం వల్ల, అతిశీతల పదార్థాలతో దవడను తరచుగా కాపడం వల్ల, కనీసం నాలుగు లేక అయిదు రోజుల్లో దవడవాపు-నొప్పి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. కొద్ది మందిలో ఉపశమనం లభించడానికి మరిన్ని రోజులు పట్టవచ్చు. మందులతో పాటు మధ్యమధ్యలో మౌత్‌వాష్‌లను గాని, ఉప్పునీళ్ళతో పుక్కిలించడం గాని చేస్తే నోటి దుర్వాసనకు దూరంగా ఉండవచ్చు.

శస్త్రచికిత్స :

ఔషధాలు వాడిన తరువాత కూడా రెండు-మూడుసార్లు ఈ సమస్య తిరిగి పునరావృతమైతే, దానికి శస్త్రచికిత్స ఒక్కటే సరైన చికిత్సా విధానం. అంటే ఆ జ్ఞాన దంతాన్ని తీసివేయడం అన్నమాట! దీనివల్ల ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. అయితే మామూలు పళ్ళు తీయడం కంటే, జ్ఞానదంతం తీయడం కొంచెం క్లిష్టమైన సమస్య. దంతవైద్యులు సలహా ఇస్తే ఏ మాత్రం అనుమానించక ఇలాంటి పళ్లను తీయించుకోవటమే మంచిది. లేకుంటే తరుచుగా ఇబ్బందులకు గురి కావలసి రావచ్చు.

పరీక్షలు :

శస్త్రచికిత్స ద్వారా జ్ఞానదంతాన్ని తీసివేయవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా మూడు రకాల పరీక్షలు చేయించుకోవడం మంచిది.

1) ఎక్స్‌రే : ఎక్స్‌రే ద్వారా దవడలు, పంటి రచనను గుర్తించే అవకాశం ఉంటుంది. దీని పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స విధానాన్ని ఎంచుకొనే అవకాశం ఉంది.

2) మూత్ర పరీక్ష : మధుమేహ వ్యాధిని గుర్తించడానికి ఉపయోగపడుతుంది.

ఈ కనీస పరీక్షలు చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవడం క్షేమదాయకం కాదు. ముందు జ్ఞాన దంతానికి జ్ఞానానికిసంబంధం ఉందనే మూఢ నమ్మకాన్ని విడనాడి తగిన సమయంలో సరైన దంతవైద్యుని దగ్గర చికిత్స చేయించుకోవడం మంచిది. వ్యాధిని ముదర బెట్టుకొని ఇబ్బందులు పాలయ్యే బదులు ప్రారంభదశలోనే గుర్తించి సమస్య నుంచి ఉపశమనం పొందడం మంచిది. అంతే కాకుండా 'కాన్సర్' వంటి ప్రాణాంతక వ్యాధికి దూరంగా ఉండే అవకాశం కూడా ఏర్పడుతుంది. ✤

చిన్న పిల్లల్లో మందుల వాడకం



పిల్లలకు ముఖ్యంగా నెలలోపు చంటి పిల్లలలో, పెద్దల వలె కాకుండా మందుల పట్ల వారి స్పందన వేరే విధంగా ఉంటుంది. నెలలోపు చంటి పిల్లలకు మందులు ఇచ్చేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలి. వీరికి వారి బరువును బట్టి మోతాదు నిర్ణయించాలి. ఈ వయస్సు పిల్లల్లో మూత్ర పిండములు, లివర్ ఎన్‌జైమ్ మొదలగునవి ఇంకా పూర్తిగా పరిపూర్ణత చెందనందువలన మందుల ప్రభావం ఎక్కువ ఉండి మందుల వలన కలుగు రుగ్మతలకు సులభంగా లోనవుతారు. వీరిలో ప్రత్యేకించి మందుల మోతాదును బరువును బట్టి నిర్ణయించాలి. ద్రవ రూపంలో మందులు ఉపయోగించడం పిల్లలలో సులభంగా ఉంటుంది. కాని ఈ ద్రవంలో తీపి ఉన్నందువల్ల దంతక్షయానికి దారితీయగలవు. అందువలన ఎక్కువ కాలం మందులు వాడవలసిన పిల్లలకు మాత్రలు, గొట్టములు లేక షుగర్‌లేని సిరప్‌లు ఇవ్వడం శ్రేయస్కరం. చిన్న పిల్లల్లో ట్రెట్రాసైక్లిన్స్ వాడకుండటం మంచిది. వాటి వలన దంతాలు రంగుమారే ప్రమాదముంది. నిద్రమాత్రల వలన మెదడు, శరీరం చురుకుతనం తగ్గి మందమతులయ్యే ప్రమాదముంది. కోర్టికాస్ట్రాయిడ్స్ చిన్నపిల్లల్లో పెరుగుదలను అరికడతాయి. పిల్లల్లో ఎంత తక్కువ మందులు వాడితే అంత మంచిది. ✤

అంపశయ్య నవీన్

“ఏమండీ రచయితగారూ! మీకీ విషయం తెలుసా?” అంటూ వచ్చాడు కేశవరావు...

“ఏ విషయం?” అన్నాన్నేను.

కేశవరావు, నేను కొంతకాలం కలిసి పని చేశాం. కేశవరావు ఎప్పుడు కలిసినా ఏవేవో కబుర్లు చెబుతూనే ఉంటాడు. ప్రపంచంలో తనకు తెలీని విషయం లేదన్నట్టుగా మాట్లాడతాడు. ఎవరన్నా అతనికేదన్నా చెప్పబోతే “అది నాకెప్పుడో తెలుసు” అంటాడు. నేనిప్పుడే ఈ వార్త టీవీలో చూశాననో, రేడియోలో విన్నాననో చెప్పినా అతడు “ఆ వార్త నాకెప్పుడో తెలుసు” అనేస్తాడు. అన్నిటికంటే ఎక్కువగా కేశవరావుకు ఆడవాళ్ళను గూర్చి మాట్లాడటమంటే చాలా ఇష్టం “మీకీ విషయం తెలుసా” అని అతడన్నాడంటే అతడు తప్పకుండా ఎవరో ఒక స్త్రీ గురించే చెప్పబోతున్నాడని నాకనిపించింది.

“సుజాత అని మన కొలీగ్ ఒకామె ఉండేది చూడండి. ఆమె మీకు గుర్తుందా?” అడిగాడు కేశవరావు.

“గుర్తు లేకేం? ఆమె మన కాలేజీలో కల్చరల్ అసోసియేషన్‌కు ఎడ్వయిజర్‌గా ఉంటుండేది. స్టూడెంట్స్ చేత మంచి నాటకాలు వేయిస్తుండేది – ఆమె కూడా బాగా పాడుతుండేది” అన్నాను–

“అవును... మీకు బాగానే గుర్తుందే! ఆమె భర్తనొదిలేసి ఓ పెళ్ళైన వాడితో సంబంధం పెట్టుకోవడం... ఆమె సంపాదించిన ఆస్తినంతా అతడు కాజెయ్యడం.. ఆ విషయాలన్నీ కూడా మీకు తెలుసుకదా...”

“అట్లాంటి విషయాలు నాకు తెలీవు. నువ్వే అప్పుడప్పుడు స్టాఫ్‌రూంలో లేడీ లెక్చరర్స్ ఎవరూ లేనప్పుడు ఇలాంటి విషయాలు చెబుతుండేవాడివి... నువ్వు మోసుకొచ్చే ఇలాంటి వార్తల్నిగానీ, వాటిల్లోని నిజానిజాల్నిగానీ నేనెప్పుడూ పట్టించుకోలేదు..”

“మీరు పట్టించుకోలేదనుకోండి... కానీ నేను తెచ్చే వార్తల్ని గాలి వార్తలో, ధూళివార్తలో అనుకోకండి.. నేను ప్రత్యక్షంగా చూశాకే ఏ వార్తనైనా మోసుకొస్తాను...”

“ఇంతకూ ఇప్పుడు నువ్వు మోసుకొచ్చిన వార్తేమిటో చెప్పు”

“మన సుజాతాదేవి మొన్ననే ఆమె పెద్ద కూతురు పెళ్ళి చేసింది. ఆ పెళ్ళికి నేను వెళ్ళాను కూడా...”

“సుజాత నాక్కూడా ఆహ్వానం పంపించింది. నేనే వెళ్ళలేకపోయాను..”

“పెళ్ళయ్యాక వాళ్ళిద్దరూ అమెరికాకు వెళ్ళిపోయారు.. ఎందుకంటే ఆ అబ్బాయి... అంటే సుజాత అల్లుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడట. ఈ అమ్మాయిక్కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉంది. చాలా తెలివైన అమ్మాయే. చూడటానిక్కూడా వాళ్ళ అమ్మలాగే చాలా అందంగా ఉంటుంది... అమెరికాకు వెళ్ళాక ఆ అమ్మాయి ఏం చేసిందో తెలుసా? అక్కడికి ఇదివరకే వెళ్ళిపోయి ఏదో జాబ్ చేస్తున్న ఓ కుర్రాడి ప్రేమలో పడిపోయి భర్తను వదిలేసి ఆ కుర్రాడితో ఉండిపోయిందట... అసలు విషయమేమిటంటే ఇక్కడున్నప్పుడే ఈ అమ్మాయికి, ఆ అబ్బాయికి మధ్య ఏదో వ్యవహారం నడిచిందట... పెళ్ళికూడా చేసుకుందామనుకున్నారట... ఏవో కారణాల వల్ల వాళ్ళ పెళ్ళి జరగలేదట. ఆ అబ్బాయికేదో అవకాశం వస్తే అమెరికా వెళ్ళిపోయాడట. అతడు అమెరికాకు వెళ్ళిపోయిన ఐదారు నెలల తర్వాత ఈ అమ్మాయి పెళ్ళయ్యింది. ఈ అమ్మాయి కూడా భర్తతో అమెరికా వెళ్ళింది. అక్కడికి వెళ్ళిన నెల రోజుల్లోనే మన సుజాత కూతురు అక్కడే ఉన్న తన మాజీ ప్రియుణ్ణి కలుసుకోగల్గిందట... ఇంకేముంది.. భర్తను వదిలేసి ప్రియుడి దగ్గరకు వెళ్ళిపోయింది.. ఈ కాలపు పిల్లలు ఎంత బరితెగించి పోయారో చూశారా?” అన్నాడు కేశవరావు.

“ఎక్కడో అమెరికాలో జరిగిన ఈ విషయాలు మీకెలా తెలిశాయి? ఇవన్నీ వట్టి

పెద ధోరణులు



గాలివార్తలేమోనని నా అనుమానం”

“గాలి వార్తలు కావండీ బాబూ! మొన్ననే అమెరికా నుండొచ్చిన మా తమ్ముని కొడుకు చెప్పాడు.. మీకు మరో ఇంటరెస్టింగ్ న్యూస్ కూడా చెబుతాను వినండి... మనం పని చేసిన ఉమెన్స్ కాలేజీలో అహల్యాదేవి అని మరొకామె ఉండేది... మీకు గుర్తుందా?”

“ఉంది... ఆమెకు ఈ మధ్యనే ప్రిన్స్‌పాల్‌గా ప్రమోషనొస్తే ఇక్కణ్ణించి వెళ్ళిపోయిందని మొన్నెవరో చెప్పారు కూడా”

“అవును కదా... ఈ అహల్యా దేవి యవ్వనంలో ఉన్నప్పుడు ఎన్నెన్ని ఎడ్వంచర్స్ చేసిందో మీకు తెలుసు కదా! ఎంతమంది ప్రియుల గుండెల్ని బద్దలు చేసిందో కూడా మీకు తెలుసు కదా... ఒకప్పుడు తల్లి చేసిన ఇలాంటి పనుల్నే ఇప్పుడామె కూతురు చేస్తోంది.. అహల్యా దేవి కూతురు పేరు శ్రావ్య... ఈ శ్రావ్య ఇక్కడి యూనివర్సిటీలో ఎం.కాం. చదువుతోంది. ఓ కుర్రాడు ఈ శ్రావ్యను ప్రేమిస్తున్నానని ఆమె వెంట పడ్డాడట... కొంతకాలం ఇద్దరూ కలిసి సినిమాలకూ, షికార్లకు వెళ్ళారట... ఏమైందో ఏమిటో తెలీదు... సడెన్‌గా ఆ అబ్బాయి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు – అతడు ఆత్మహత్య చేసుకోవడానికి ఈ అమ్మాయే కారణమంటున్నారు... అతనితో ఈ ప్రేమ వ్యవహారం నడుస్తుండగానే ఈ శ్రావ్య మరో అబ్బాయితో తిరగడం మొదలెట్టిందట... మొదట అబ్బాయితో మన పెళ్ళి జరగదు అని చెప్పేసిందట.. అంతే... ఆ అబ్బాయి స్లీపింగ్ పిల్స్ మింగేశాట్ట! ఎంతన్యాయం! ఎంతన్యాయం! మరో షాకింగ్ న్యూసేమిటంటే ఇప్పుడు శ్రావ్య తన రెండో ప్రియుణ్ణి కూడా వదిలేసి మూడో ప్రియుణితో తిరుగుతోందట...

“కేశవరావు దయచేసి మీరిలాంటి కబుర్లు చెప్పడం మానేసెయ్యండి... మీరిలాంటి కబుర్లు చెప్పడం వల్ల అవి విన్న వాళ్ళకు స్త్రీలంటే చాలా నీచమైన అభిప్రాయం కలుగుతుంది....స్త్రీలందరూ ఇలాంటి వాళ్ళేనని, శీలవంతులైన స్త్రీలంటూ మన సమాజంలో ఎవరూ ఉండరనీ మీ గాలికబుర్లు వినేవాళ్ళు అనుకునే అవకాశం ఉంది...”

కేశవరావు లాంటి వాళ్ళు మన సమాజంలో చాలామంది ఉంటారు.... మన పక్కవాళ్ళ ప్రైవేట్ జీవితాల్లోకి తొంగి చూడటం... వాళ్ళను గూర్చి... ముఖ్యంగా వాళ్ళ సెక్స్ జీవితాలను గూర్చి రకరకాల పుకార్లను సృష్టించి ప్రచారం చెయ్యడం... స్త్రీలను సెక్స్ ఆబ్జెక్ట్సలా తప్ప మనలాంటి మానవులే అన్న దృష్టితో చూడలేకపోవడం... అలా చూడటం ద్వారా వాళ్ళకే స్పష్టంగా తెలీని ఓ ఆనందాన్ని అనుభవించడం వీళ్ళకు అలవాటైపోతుంది. ఇదొక పెదధోరణి. ఇది పెదధోరణి అనే విషయం వాళ్ళకు తెలీదు. తమ ఈ ధోరణి వల్ల సమాజానికెంత హాని కలుగుతున్నదో కూడా వీళ్ళకు తెలీదు.

అంతే శక్తి!

ఒకసారి కొందరు వ్యక్తులు ఒక చోట కూర్చొని మాట్లాడుకుంటున్నారు. మధ్యలో వృద్ధాప్యంపై చర్చ వచ్చింది. 'వృద్ధాప్యం వలన అన్నీ ఇబ్బందులే' అని ఒకరు అన్నారు. కొందరు ఈ వాదనను సమర్థిస్తే మరికొందరు మాత్రం వ్యతిరేకించారు. 'మనిషి శక్తి సామర్థ్యాలను కేవలం వయసుతోనే లెక్కలు కట్టలేం' అని ఇంకో వ్యక్తి వాదించాడు. ఇలా ఎవరికి వారు వాదించుకుంటున్నా వారిలోనే ఉన్న నసీరుద్దీన్ మాత్రం ఏమీ మాట్లాడలేదు.

'నసీరుద్దీన్..ఈ విషయంలో నీ మాటేమిటి' అని అడిగాడొకతను.

'నాకా సమస్య ఏదీ రాదు' అన్నాడు నసీరుద్దీన్ తాపీగా.

'అంటే వృద్ధాప్యం వలన నీకు ఎలాంటి కష్టాలు రావా?' అని అడిగాడు మరొకతను.

'లేదు. నాకు 20 ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు ఎంత శక్తి ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంది' అన్నాడు నసీరుద్దీన్.

'అదెలా సాధ్యం? నీవు కచ్చితంగా చెబుతున్నావా' అని మరో మిత్రుడు ప్రశ్నించాడు.

'అవును..నేను చెప్పేది నిజమే. మా ఇంటి ఎదురుగా ఒక పెద్ద బండరాయి ఉంది. నాకు ఇరవై ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు దాన్ని నేను అంగుళం కూడా కదల్చలేకపోయాను. ఇప్పుడూ అంతే. కనుక నా శక్తి సామర్థ్యాల్లో మార్పు రాలేదనే కదా అర్థం' అన్నాడు నవ్వుతూ..

వివిధ దేశాల రాజధానులు, కరెన్సీలు

దేశం	రాజధాని	కరెన్సీ
భారతదేశం	న్యూఢిల్లీ	రూపాయి
క్యూబా	హవానా	పెసో
కెనడా	అట్టావా	డాలర్
ఈజిప్టు	కైరో	పౌండ్
ఇటలీ	రోమ్	లీరా
ఆస్ట్రేలియా	కాన్‌బెర్రా	డాలర్
ఇరాక్	బాగ్దాద్	దీనార్
దక్షిణాఫ్రికా	ప్రిటోరియా	ర్యాండ్
నార్వే	ఓస్లో	క్రౌనర్
నెదర్లాండ్స్	ఆమ్‌స్టర్‌డామ్	గిల్డర్
ఇరాన్	టెహ్రాన్	రియాల్
న్యూజీలాండ్	వెల్లింగ్టన్	డాలర్
నేపాల్	ఖాట్మండు	రూపాయి

–సేకరణ : బి. సురేంద్రరావు, 10వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భద్రాచలం, ఖమ్మం జిల్లా–507111

గతవారం జవాబులు

క్విజ్-21: 1. గురజాడ 2. జయదేవుడు 3. చంద్రుడు 4. జైపూర్ 5. సీతాఫలం 6. ఉష్ట్రపక్షి 7. జిరాఫీ 8. సబర్మతి 9. 1930 10. జిడ్డు కృష్ణమూర్తి

ఏ రంగు?: ఎర్రని చీరను ఆకుపచ్చ రంగు కాంతిలో ఉంచితే ఆ చీర నలుపు రంగులో కనిపిస్తుంది. కనుక దీప కరక్టు.

1-9-02 సంచిక పజిల్స్‌కు సరైన సమాధానాలు రాసిన వారు :

క్విజ్ 20 : **ఎం. త్యాగరాజు**, నరసన్నపేట. **కె. భగవంతరావు**, నెల్లూరు, **పి. పవన్ సాయి**, కొత్తకోట, **వి. భాస్కర్**, రేణిగుంట.

డాట్‌కామ్.

మీకు ఈ-మెయిల్ ఐ.డి. ఉందా? మీకు తెలిసిన వారికి తెలుగులో ఈ-మెయిల్ పంపాలనుకుంటున్నారా? అయితే మీరు ఈ కింది సైట్‌లోకి వెళితే తెలుగులో మెయిల్ పంపవచ్చు.

www.telugulekha.com

చిన్నారి చిత్రకారులు

సాకా ఉమాసాగర్, 10వ తరగతి
బిహెచ్‌పివి హైస్కూల్, విశాఖ



వి. భవానీ, 9వ తరగతి
మారుతీ విద్యాలయం, గంపలగూడెం



ఎం. ప్రేమ్‌సాయి, 6వ తరగతి
నాగార్జున హైస్కూల్, ఖైరతాబాద్

ఎం. శ్రీలత, 8వ తరగతి
శ్రీరామకృష్ణ విద్యాలయం, సీతానగరం

రుక్మిణి

డుం.. డుం... డిగా.. డిగా..!

"ఇక మన యవ్వారమంతా ఫోర్–డి, డీ–డీ–డీ–అబ్బో! మాదసలే విశిష్టమైన పార్టీ.. మనరూటూ – తరీఖా అంతా వేరు.. మన కార్యక్రమాలన్నీ కూడా... అబ్బో!" కాసేపు భా.జ.పా. నాయకుడు రావుగారు ముందు తనకు తానే పరవశించి పోయి కండ్లు తెరిచి చూసేసరికి కార్యకర్తలు.. అక్కడ రావిచెట్టు కింద పోగైన జనవూ తనవంకే చిత్రంగా చూడడం గమనించి కాస్తంత నీరుగారి పోయాడు – వెంటనే సర్దుకుని 'జైశ్రీరాం' అని చప్టా మీద గోచీ ఊడుతున్నా లెక్క చేయకుండా... పూనకం వచ్చిన వాడిలా పెడబొబ్బలకు తగులుకోడంతో – ముందు జనం హడలిపోయి, కాస్తంత సర్దుకుని కూర్చున్నారు.

"మన 'డిల్లీ సంకల్ప్'లోని ముఖ్యాంశం.. ముఖ్యంగా మనం పల్లెపల్లెకూ.. గల్లి గల్లికీ దీన్నందించాలె... ఫోర్–డీ–ఈడీలే మనకు తోడూ–నీడా... జనాలకింత అండా...

"త్రీ–డీ సిన్మాలాగానా... బాగుందే! ఓ యువకుడు లొటికెలేశాడు." అహహ... అదే వివరిస్తాను..' ఫోర్–డీ లంటే మన పార్టీ కట్టుబడి ఉంది. నాలుగు అంశాలకు! అంటే నాలుగు డీ–డీ–డీ–

జనాలకంతా వినోదంగా ఉంది– వీళ్ళెపుడూ ఇంతే! కకావికలైనపుడల్లా ఇట్లాంటి అర్థంగాని మాయమాటలందుకుని చిందులేస్తారు.

"డెడికేషన్ అంటే అంకితభావం... మరి డిసిప్లిన్.. అబ్బో... మన క్రమశిక్షణన్నమాట – ఇంకోటి డిటర్మినేషన్ – కృతనిశ్చయం.. చివరిది డైనమిజం... 'చలోగావ్'కూ – ముందుకు ముందుకు దూసుకు... తోసుకుపోడం... డం...

రావుగారు అట్లా తగులుకుని చెప్తుంటే పనీపాటల్లేక ఈసురోమని చేతులూగించుకుంటూ 'ఏంచేయాలో... పొట్ట ఎట్లా నింపుకోవాలో' తేలని ముసలీ ముతకా, ఆడా మగా అందరికీ అదేదో వింతగానే అనిపించింది.

"ఈ నెల చివర్నుండి ఇదే మన కార్యక్రమం... 'దున్నగలిగేవానికే భూమి'... పడావు భూములన్నీ అట్లా పడుండడానికి వీల్లేదు – వాటిని గవర్నమెంటు ఖరీదు చెయ్యాలె – మంచి రేటుపెట్టి కొనెయ్యాలె – డబ్బు లేకపోతే ప్రపంచ బ్యాంకు ఉండనే ఉంది. అట్లా అనాథగా పడున్న భూవులన్నీ అమ్మకాలు జరగాలి... ఉత్పత్తులు పెరగాలి. దున్నగలిగిన వాండ్లకే భూవులు... పల్లెలు వర్థిల్లాలి... జైశ్రీరాం...

రావుడికీ, పడావు భూవులకీ సంబంధం ఎంతపీక్కున్నా జక్కులోడికి అర్థం కాలేదు. "కాబట్టి 'అంకితభావం' మన మొదటి సూత్రం..." రావుగారు ఆవసోపోలు పడుతూ దీర్ఘంగా వివరణకు తగులుకున్నాడు.

"అరె యాద్గిరీ... అంకితభావమంటే దేనికి అంకితం? అర్థంగావట్లేదు... అవినీతికి అంకితమా? కుంభకోణాలకు అంకితమా? ఏందీ"?

"అదికాదొరే... మన వాజ్‌పేయిగారు పూరా అమెరికాకు అంకితమైపోయి వాళ్లెం జెప్పినా కిక్కురుమనకుండా అమల్లోకి పెట్టే అంకితం అన్నమాట! మన బిజెపీ మంత్రులున్నారంటే తలా ఒక కుంభకోణానికి అంకితమైపోయింద్రు గదా!"

"మరయితే – దాన్ని వీళ్ళు పల్లెపల్లెకూ తిరిగి చెప్పుకోడం ఏంది? అట్లా చెప్పుకుంటే బాగుంటదా?" మల్లేశు అమాయకంగా అడిగాడు.

"గదే.. గదే మతలబు.. మా మీద అట్లా చెడ్డ ప్రచారం జరిగిపోతుంది. అంతా శుద్ధ అబద్ధం.. మేమేం చేసినా మీరు మాత్రం నమ్మకండీ... అని జనాలను మాయజేయడం అన్నమాట!" యాద్గిరి మరో బీడీ వెలిగించాడు.

"క్రమశిక్షణ మనకు ఆరోప్రాణం... దేశం ముందుకు పోవాల్నంటే మంచి క్రమశిక్షణతోని పని చేయాలె....!"

"వెంకునాయుడు భూవుల బాగోతాన్నీ... విద్యాసాగరరావు పెట్రోలు గాసు బంకుల కేటాయింపుల జాబితాల్నీ వాళ్ళ పార్టీ వాళ్ళే పత్రికలకూ... ప్రజలకూ వుప్పందించినారని కుప్పలు తెప్పలుగా వాళ్లే ఒకళ్ళ మీద ఒకళ్ళు అరుచుకుని మళ్ళీ ఉక్కూదుక్కూ... క్రమశిక్షణంటారేందన్నా!"

"జనాల మీద పడి అట్లా మాటలు చెప్పడం వాళ్ళకు బాగా అలవాటు!"

కృతనిశ్చయం' – "దేశాభివృద్ధి కోసం మన పార్టీ కృతనిశ్చయంతో కదిలి ముందుకు పోతుంది... వస్తుంది..."!

యాద్గిరి విరగబడి నవ్వాడు.. "ఓరి మల్లేశా... ఈ యన్డీయే కిచిడీ కూటమిలోని చిల్లర మల్లర పార్టీల చెవుల్లో పూలు పెట్టడానికి మంచి 'కృతనిశ్చయం'లోనే ఉన్నారన్న సంగతి పాపం... వాళ్ళకు తెలవకపాయె!" బీడీ దమ్ములాగి దూరంగా విసిరేశాడు యాద్గిరి!

"ఇక అంతా 'చలనశీలం'... శీలం కోసం చలనం... అన్నింట్లోనూ అత్యంత వేగం... వేగం...ఎక్కడా బ్రేకూ... ఆగిపోడం లేదు... అందుకే మీ పల్లె పల్లెకూ 'గావ్‌చలో' కార్యక్రమం... ఇది మీది... మనది...!"

"మీరేందో గావ్‌చలో–గానాగావో బాగానే వుందిగానీ... మాకేమో తిండానికి తిండి దొరక్క 'పట్నాలకు చలో'?" బండ సత్తెయ్య రుసరుస లాడడంతో రావుగారు బిత్తరపోయారు.

"ముఖ్యమంత్రి చంద్రబాబు గారేమో రోజుకో పథకం అన్జెప్పి మా నోరూరించి అన్నిట్లోనూ మొండిచెయ్యి చూపించి అటకలెక్కిస్తున్నాడాయె! అసలు మీ రాజకీయం ఏందో అర్థం కావడం లేదు" – జక్కులోడు మటమటలాడిపోయాడు.

"అక్కడ సెంటర్లనేమో మీకు బయటనుండి మద్దతు... మీ ఇష్టారాజ్యం మీద.. ఇంగ అడిగీ అడగంగనె ఊరూరికి పనికి ఆహారం బియ్యం పంపిస్తరు – వీళ్ళేమో లారీలకు లారీలు పొరుగు రాష్ట్రాలకూ ఎఫ్‌సిఐ... మిల్లర్లకీ అమ్మక దొబ్బుతరు... పట్టిచ్చుకునేటోడే లేకపాయె!"

మల్లేశు మాటలకు అక్కడి సీనంతా గందరగోళంగా మారిపోయింది – రావుగారేమో ఒక పక్క '4–డి'ల గురించి ఢీ–ఢీ–అని వివరించడానికే ప్రయాస పడిపోతున్నాడు. ఈ మధ్యలోనే జక్కులోడు లేచి తగులుకుని ఈ 'గావ్‌చలో'– గానా బజానా, అటు పక్క నుంచి గుజరాత్‌లో 'గౌరవయాత్ర' అంటే ఏంటో చెప్పితీరాల్సని తగులుకున్నాడు.

"గౌరవయాత్రంటే ఏందిసారూ.. దేశగౌరవం గాలికి కొట్టుకుపోయిందనా... మీ పరువు–గౌరవం గంగలో కలిసిందనా? ముందుగా మతలబేందో చెప్పమని బొబ్బలకు తగులుకోవడంతో రావుగారు కకావికలై పోయినాడు గదా!

ఈలోపున కుర్రకారు గుంపోటి '4–డి' పల్లవి పాటగట్టి పాటకు తగులుకున్నారు – 'డుం–డుం–డిగా–డిగా...డుండుం....

సభంతా రసాభాసగా మారిపోయింది!

వాయిదాతో ప్రాక్టీస్‌కు బ్రేక్

మారేపల్లి లక్ష్మణ్

జాతీయ క్రీడల నిర్వహణకు నడుంబిగించిన ఆంధ్రప్రదేశ్ ఈ పోటీలకు వేదిక కావడం ఇదే తొలిసారి. దానిలో భాగంగా స్టేడియాలు, క్రీడా గ్రామాల శరవేగ నిర్మాణంతో పోటీలను నవంబర్‌లో జయప్రదంగా నిర్వహించడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలకు జాతీయ క్రీడల వాయిదా వార్త బ్రేక్ వేసింది. ఆసియా క్రీడలకు, జాతీయ క్రీడలకు మధ్య వ్యవధి తక్కువ ఉండడంతో ప్రాక్టీస్‌కు సమయం లేదని అథ్లెట్లు చేసిన విన్నపాన్ని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు సురేష్ కల్మాడీ మన్నించి నెలరోజుల పాటు వాయిదా వేశారు. నవంబర్ 15 నుంచి 25 వరకు జరగాల్సిన ఈ క్రీడలు డిసెంబరు 13-23 తేదీల మధ్య జరుగుతాయి. అప్పుడే కల్మాడీ జాతీయ క్రీడల మస్కటైన ఒంగోలు గిత్త 'వీర'ను ఆవిష్కరించారు. జాతీయ క్రీడలు మొదట్లో మార్చిలోనే నిర్వహిస్తామని ఊదరగొట్టినా చివరకు నవంబరు తేదీలను ఖరారు చేశారు. ఈ జాతీయ క్రీడలకు కూడా గత పంజాబ్ జాతీయ క్రీడల మాదిరిగానే వాయిదాల పర్వం మొదలయింది. స్టేడియాల నిర్మాణం, క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వమే వాయిదాను కోరిందని అనధికారవర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. కారణాలేమయినా దేశంలోనూ, రాష్ట్రంలోనూ వివిధ క్రీడాంశాలకు చెందిన క్రీడాకారులు పసిడి పతకాలు సాధించే దిశగా వారు చేస్తున్న ప్రాక్టీసుపై నీళ్లు చల్లినట్లైంది.

ఈ జాతీయ క్రీడల్లో మొత్తం 30 క్రీడాంశాల్లో పతకాల కోసం పోటీ జరుగుతుంది. కాగా ఈ పోటీల్లో నాల్గు కొత్త క్రీడాంశాలైన నెట్‌బాల్, ట్రయథ్లాన్, సెపక్‌తక్రా బీచ్ వాలీబాల్ క్రీడలను జాబితాలో చేర్చారు. రోలర్ స్కేటింగ్ ప్రదర్శన క్రీడగా అనుమతించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలు జాతీయ క్రీడల నిర్వహణకు ముస్తాబవుతున్నాయి. హైటెక్ సిటీకి దగ్గరలో వున్న గచ్చిబౌలి ప్రధాన క్రీడా గ్రామంగా రూపుదిద్దుకుంది. దీనితోపాటు యూసుఫ్‌గూడ, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలలో ఆయా క్రీడాంశాలను నిర్వహించేందుకు అనుగుణంగా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక జాతీయ క్రీడలను వేదికగా చేసుకుని జాతీయ స్థాయిలో మన రాష్ట్రంలో క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను ఇనుమడింపచేసేందుకు అటు రాష్ట్రప్రభుత్వం, ఇటు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నాయి. జాతీయ క్రీడల సరళిని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ స్థానం ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. ఇంతవరకు జరిగిన నాలుగు జాతీయ క్రీడల్లోని ఫలితాల పట్టికలో రాష్ట్రం స్థానం 13 లేదా 14. ఇక ఏ జాతీయ క్రీడల్లోనూ మన క్రీడాకారులు 15కు మించి పతకాలు సాధించిన రికార్డు కూడా లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరగనున్న జాతీయ క్రీడల్లో రాష్ట్రాన్ని మొదటి మూడు స్థానాల్లో పదిలపరిచేందుకు కృషి జరుగుతోంది. అందుకనుగుణంగా క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగేలా వివిధ క్రీడాంశాల్లో శిక్షణనిస్తున్నారు. పతకాల పట్టికలో రాష్ట్రం తొలి మూడు స్థానాల్లో నిలవడంతో పాటు దాదాపు 50 పతకాలు సాధించే లక్ష్యంతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తోంది.

క్రీడారంగంలో రాష్ట్ర అథ్లెట్లు సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు సృష్టించి రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేశారు. వెయిట్ లిఫ్టింగ్‌లో కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ, నీలంశెట్టి లక్ష్మి, చదరంగంలో పెంట్యాల హరికృష్ణ, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, మహిళల టెన్నిస్‌లో సానియా మీర్జా, బ్యాడ్మింటన్‌లో పుల్లెల గోపిచంద్, గుత్తా జ్వాల, శృతికురియన్ పలు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున విజయపతాకాన్ని ఎగురవేశారు. ఇక టెన్నిస్ డబుల్స్‌లో ఒకరైన మహేష్ భూపతి, అంతర్జాతీయ క్రికెట్‌లో బెస్ట్ ఇన్నింగ్స్ క్రీడాకారుడిగా విజ్డన్ పుటలకెక్కి ఇటీవలే అర్జున అవార్డును గెల్చుకున్న వి.వి.ఎస్.లక్ష్మణ్, భారత మహిళా టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మిథాలీరాజ్, ఇంగ్లండ్ సిరీస్‌లో బ్యాటింగ్ మాయాజాలంతో సిరీస్‌ను సాధించి పెట్టిన భారత యూత్ జట్టు కెప్టెన్ అంబటి తిలక్ రాయుడు మన రాష్ట్రానికి చెందిన వారు కావడం గర్వకారణం. క్రీడాకారుల వ్యక్తిగత ప్రతిభ, నైపుణ్యానికి తోడు ప్రేరణ, ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని ఫలితాలు సాధించవచ్చని భావిస్తున్న ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలను, నజరానాలను అందజేస్తోంది. అందుకు తగ్గట్లే మన క్రీడాకారులు కూడా ఆయా క్రీడాంశాల పోటీల్లో తమ సత్తా చాటుతూ, పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ పేరును సమున్నతంగా నిలుపుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వేదికగా జరగనున్న నేషనల్ గేమ్స్ మన రాష్ట్రానికి చెందిన క్రీడాకారుల క్రీడా పటిమకు గీటురాయి కానున్నాయి. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు సముచిత స్థానం కల్పించాల్సిన బరువు బాధ్యతలు మన క్రీడాకారుల భుజస్కంధాలపై వున్నాయి. ❖

జాతీయ క్రీడల మస్కట్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి

తీరిన స్టేడియాల కొరత

- గచ్చిబౌలిలో సుమారు 13 లక్షల అడుగుల విస్తీర్ణంలో ప్రధాన స్టేడియం నిర్మించారు. స్విమ్మింగ్, టెన్నిస్, ఇతర క్రీడామైదానాలతో పాటు హెల్త్‌క్లబ్, పార్కుల నిర్మాణం జరిగింది.
- ప్రధాన స్టేడియంలో 30 వేల మంది ప్రేక్షకులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.
- గచ్చిబౌలిలోనే 4 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం గల ఎయిర్ కండీషన్డ్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించారు.
- స్విమ్మింగ్ పోటీల కోసం 10 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం. మాడర్న్ హీటింగ్ సిస్టమ్ ద్వారా నీటి ఉష్ణోగ్రతను కంట్రోల్ చేసే విధానం దీని ప్రత్యేకత. ఒకేసారి రెండువేల మంది స్విమ్మింగ్ పోటీలను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.
- యూసుఫ్‌గూడలో ఇండోర్ స్టేడియం. రెండు వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం గల ఈ మల్టీపర్పస్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీలు జరుగుతాయి.
- సరూర్‌నగర్‌లో మరో ఇండోర్ స్టేడియం. జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్ పోటీలు జరిగే ఈ స్టేడియం కెపాసిటీ రెండు వేలు.
- ఫతేమైదాన్‌లో నాల్గు వేల మంది ప్రేక్షకులు కూర్చునేందుకు వీలుగా 6 కోట్లతో టెన్నిస్ స్టేడియం నిర్మాణం
- ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో 6 కోట్ల వ్యయంతో వెల్‌డ్రోమ్ నిర్మాణం
- ఎల్.బి.స్టేడియం, హుస్సేన్‌సాగర్, బేగంపేట హాకీ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, కులీకుతుబ్‌షా స్టేడియం, గోషామహల్ స్టేడియం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో సైతం జాతీయ క్రీడాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

పసునూరి రవీందర్

వలస పక్షులు

సూర్యుడు ప్రకృతిపై పగబట్టినట్లు భగభగ నిప్పులు కురిపిస్తున్నాడు.. సమయం అప్పటికి పది దాటనే లేదు. శరీరం అంతా చమటల మయం, "ఏమిటో ఈ వాతావరణం" అని మనసులోనే అనుకుంటూ బస్టాప్‌కు చేరుకున్నాడు పరంధామయ్య. పనికోసం పడిగాపులు కాసే కూలీజనాలు, స్కూళ్ళకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు, వచ్చిపోయే వాహనాలతో రద్దీగా ఉండే ఆ సెంటర్‌లో కాసింత టెన్షన్, మరికొంత కోపంతో ఉన్న పరంధామయ్య అలవాటులో భాగంగా ఓ కిళ్ళీ కొట్టు వద్దకు వెళ్ళి పాన్ కట్టించుకొని, కాలక్షేపం కోసం నములుతూ అటు ఇటు చూస్తూ మనసులో ఆలోచనల చక్రాన్ని తిప్పసాగాడు.

"అసలు ఈ ఆఫీసర్ వస్తాడో, రాడో, ఈ ఆఫీసుల చుట్టూ ఇంకెన్నాళ్ళు తిరగాలో ఏమో, ఆ వచ్చేలోన్ వస్తుందో లేదో. ఒక పక్క కూతురి పెండ్లికి రోజులు దగ్గరవడుతుంటే గుండెలో రైళ్ళు పరుగెడుతున్నాయి. తను పని చేసే ఆఫీసులోనేమో తన తోటి చిరుద్యోగులు మొదలుకొని పై అధికార్ల వరకు అమ్మాయి పెళ్ళి చేస్తున్నావట పెళ్ళికి స్పెషలేంటి... పార్టీ ఇవ్వవా ఏంటి? అనే వెటకారాలు, ఆఫీసు నుండి ఇంటికి వెళ్ళగానే భార్య చెప్పే సమస్యల కథలు ఒక్కొక్కటి గుర్తుకు రాసాగాయి"

★ ★ ★

సమయం పది దాటి పరిస్థితులు మారుతుండగా కూలీల గుంపులు పలుచనవసాగాయి. చేతికున్న వాచీని చూసుకొని ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆఫీసు వంక ఆశగా చూశాడు పరంధామయ్య... ఆఫీసరు వచ్చాడా! లేదా! అని. ఆ విలేజ్ అసిస్టెంట్ దగ్గరి నుండి వచ్చే సర్టిఫికెట్ పైనే పరంధామయ్య ఆశించే లోను ఆధారపడి ఉంది. గత వారం రోజులుగా ఆ ఆఫీసరు రానేలేదు. మరి ఈ రోజు కూడా వస్తాడో లేదో అని అనుకుంటుండగానే "సారూ బాంచెన్ జెర ధర్మం సెయ్యి సారు!" అనే గొంతు వినబడగానే పక్కకు తిరిగి చూశాడు పరంధామయ్య! నడి వయసు దాటి, చిరుగుల పంచె, చొక్కా ధరించి, చామనఛాయ రంగులో మాసిన గడ్డంతో, కొద్దిగా నెరిసిన జుట్టుతో చూడడానికి నిరాశ, నిస్పృహలతో, నీరసంతో చెమటలు పట్టిన ముఖంతో భిక్షమెత్తుకునే బిచ్చగాడిలా లేడతడు. అతన్ని ఒకసారి ఎగాదిగా జూసి వలకరించాడు పరంధామయ్య. పరేషాన్‌ల నేనుంటే నీ గోలేందయ్యా అంటూ కాస్త చీదరించుకుంటూ అన్నాడు. ఆ మాటకు కొంచెం కూడా కదలని రాయిలాగా నిలబడి తన గోడును వివరించసాగాడు.

"సారూ గిట్ల అడుక్కోవాలంటే నాకే ఇజ్జతనిపిస్తుంది. కానీ ఏం చెయ్యాలే. తప్పలేదు బాంచెన్" అని తలదించుకున్నాడు. ఈ మాటలు విన్న పరంధామయ్యకు ఎందుకో కొంచెం ఆసక్తి కలిగి ఇంకా తెలుసుకోవాలని "ఏమయ్యా సూడనీకి పెద్దమనిషి లాగున్నవ్, మంచి మోతుబరి రైతు లెక్కున్నవ్! ఏంది మరి, గీ అడుక్కునుడు ఏందీ" అని సంభాషణను కాస్త సాగదీశాడు.

అందుకు ఆ అనామకుడు "నా పేరు రాజయ్య, మాది వరంగల్ సారూ. వరంగల్ జిల్లా జనగామ దగ్గర ఓ పల్లెటూరు బాంచెన్. నాకు ముగ్గురు పిల్లలు. అర ఎకరం భూమి ఉన్నది. నేను, మా ఆడది కలిసి ప్రతి ఏడు అంతో ఇంతో తిండిమందం ఎల్లదీసుకుంటూ పిల్లల్ని సాదుకొచ్చెటోల్లం. మేం గూడ ఇంత సల్లబడెటోల్లం. కానీ ఈ ఏడు వాన చినుకు రాక మా బతుకులు ఎడబాసి ఎండిపోయినయి సారూ.. కరువు మా కండ్లల్ల కారం కొట్టి, మమ్ముల తిండికి దూరం కొట్టింది" అని చెప్పుకుంటూనే కళ్ళ నీళ్ళు భుజానున్న గుడ్డ (తువ్వాల)తో తుడుసుకున్నాడు రాజయ్య.

★ ★ ★

కదిలిన మనసుతో, పెకలని గొంతుతో, పొంగివచ్చిన ఆవేదనతో "మరీ ఎక్కడన్న గాపనో గీపనో, గాకూలో, గీకూలో చేసుకోవాలే కానీ గీ అడుక్కునుడు ఎందుకయ్య రాజయ్య" అన్నాడు పరంధామయ్య. నూకలు పిల్లలకు పెడుతూ, మేము ఒక్కపూట తింటూ గంజి తాగి బతికినం. అందుకే ఆ ఉన్న నూకలు అయిపోక ముందే భార్యా పిల్లలకు కూడు పెట్టాలనే తపన తోటి గీ పట్నం కొచ్చినా" అన్నాడు.

వెంటనే పరంధామయ్య ఉచిత సలహాగా "మరీ గీ పట్నంలో పనికి కరువు ఏమున్నది. ఏదో ఒక పని చూసుకో పోయావా" అని రెట్టించాడు. నేను అలాగే అనుకొని గీ పట్నానికి వచ్చిన. వచ్చిన వెంటనే మా ఊరోడు ఎవడన్న దొరుకుతడేమో చూడాలేననుకొని తిరిగి తిరిగి ఇక్కడికి దగ్గరిలో ఉన్న వాళ్ల గుడిసెల కాడికి పోయి మంచి చెడులు తెలుసుకొని ఆ పూటకు వాళ్ళనే అన్నం అడుక్కొని తిని వాళ్ళ గుడిసె పంచపాంటి పడుకొని పొద్దున్నే అడ్డ మీదికి వాళ్ళ తోటే పోయి ఒకటి రెండు రోజులు కూలి చేసినా సారు" అన్నాడు రాజయ్య.

తరువాత ఏమయ్యింది? పని ఎందుకు మాని వేశావు అని ఆత్రుతగా ప్రశ్నించాడు పరంధామయ్య.

ఏమున్నది సారూ... కరువు బారిన పడ్డ రైతులు, కూలీలు, మధ్య తరగతి పేద బీద జనాలు ఊళ్ళు వదిలి పట్నాలకు వలస వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగి ఇక్కడ దొరికే పని కూడా కరువై పోయి కూలీ కూడా తగ్గిపోయింది.

మా ఊరోళ్లు, నేను ఒక్క మేస్త్రీ దగ్గరే పని చేసేటోళ్ళం. కానీ ఒక రోజు ఆ మేస్త్రీ 'ఈ రోజు పనికి ఒకరు అవసరం లేదు' అని అన్నాడు. ఆ మాటకు నేను, మా ఊరోళ్ళం ఒకరి ముఖాలు ఒకరం చూసుకొని పుట్టెడు దుఃఖం తన్నుకొస్తుంటే తట్టుకోలేక కండ్ల నీళ్ళను కళ్ళలోనే దాచుకొని, "గియ్యాల నేనే ఊరుకుంటా. నాకు ఒంట్లో కొంచెం బాగాలేదు. మీరు పొండి పనికి" అని చెప్పి తిరుగుముఖం పట్టి మళ్ళీ మా ఊరికి పోదామనుకున్నా, కానీ ఆకలితో అలమటించే ఆలూపిల్లలకు నేను ఏం సమాధానం చెప్పాలని ఇక్కడే ఆగిపోయాను.

నాతో పని చేసే మా ఊరివాళ్ళు గుండె రాయి చేసుకున్నారు. పొట్ట చేతపట్టుకొని ఉన్న నన్ను రమ్మన లేక, పొమ్మన లేక నేలను చూస్తూ కన్నీరు కార్చారు. దుఃఖం ఆపుకోలేని మా ఊరి అయిలయ్య "ఒరే రాజయ్యా ఎట్లా బతికినోళ్ళం ఎట్ల అయినామురా. పచ్చని పంట పొలాలు, కమ్మగా కష్టసుఖాలు పంచుకున్న బతుకులు, ఎప్పుడూ జరుపుకునే పండుగలు పబ్బాలు ఏమయినాయిరా" అంటూ గట్టిగా ఏడ్వసాగాడు. అతన్ని ఓదార్చడం కోసం అతని భార్య లచ్చుమ్మ ఊరుకోమావ! ఎప్పటికీ ఒక్కలాగానే ఉంటదా! మన రాత అట్లున్నప్పుడు ఎవరు మాత్రం ఏ జేన్తరు? అని సముదాయించసాగింది. వెంటనే పక్కనే ఉన్న మల్లన్న "ఒరే రాజయ్యా నీవు కాదురా... ఇవాళ పనికి బంద్ కావల్సింది. నేను. ఎందుకంటే... అందరికంటే ముందు మన ఊరి నుండి ఇక్కడికి వచ్చి ఉన్నన్ని నాళ్ళు వారానికి రెండు మూడు రోజులైనా పని చేసి నా పెండ్లాం పిల్లలకు ఒక్క పూటైన కూడు పెడుతున్న వాన్ని, కానీ నువ్వు నిన్న కాక మొన్న ఉన్న ఊరును, కన్న వారిని, భార్య

పిల్లలను వదిలి బుక్కెడు గంజి కోసం కూలి చేద్దామని గీ పట్నం కొచ్చినావు. పట్టుమని పది దినాలైనా కాకముందే కాలం మళ్ళీ కాటేసిందిరా! అయినా ఫర్లేదు నువ్వే ఇవ్వాల పనికి పోరా రేపు వేరే ఎక్కడన్న నేను పని వెతుక్కుంటాను" అని ఆవేశంగా అన్నాడు.

ఒక్కసారే ఒంటిమీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి నాకు. మా ఊళ్ళో ఉన్నప్పుడు ఎప్పుడూ ఏదో ఒక సాకుతో నాతో గొడవపడే మల్లన్న కష్టకాలంలో కరిగిన మనసుతో పలికిన మాటలకు మనసు నిండింది. కానీ కడుపు నిండలేదు. అసందర్భపు అనురాగాలు, ఆప్యాయతలు ఎందుకూ పనికి రావని మా అయ్య అన్నప్పుడు పట్టించుకునే వాన్ని కాదు. కానీ ప్రత్యక్షంగా చూశాక గుండె చెరువైంది.

అప్పుడు మనసును కుదుట పరచుకొని "ఒరే మల్లన్నా, అసలే నీ గుడిసెలో చంటిది జ్వరం తోటి బాధపడుతూ మూల్గుతుంటే ఈ పరిస్థితులల్ల నువ్ పనికి పోనంటే ఎట్లరా? ఎట్లో అట్లా నేను ఇంకో అడ్డా కాడికి పోయి పని చూసుకుంటా" అని సమాధానపరిచి వాళ్ళందరిని పనికి పంపించి, నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న మరో అడ్డ కాడికి నడిచి కూలిపని కోసం పడరాని పాట్లు పడి, కనిపించిన ప్రతీ మేస్త్రీని కాళ్ళా వేళ్ళా పడ్డాకూడా పని లేనపుడు మేమేం చేయాలంటూ చేతులు దులిపేసుకున్నారు.

పని దొరకక కాలే కడుపుతో తిరుగుముఖం పట్టి ఆకలి తట్టుకోలేక కనిపించిన నల్లా (కుళాయి) కాడికి పోయి దోసిటితో మంచినీళ్ళు తాగి కడుపు నింపుకొని నడుస్తూ నడుస్తూ... అక్కడికి చేరుకున్నాను. కానీ తిండి లేక ఈ రెండు రోజుల నుండి నాలో ఉన్న ఆత్మ గౌరవం నిలువునా నశించి పొట్ట నింపుకోవడానికి ఏ పని అయితే ఏ ముంది అని విసిగి... కనిపించిన వారినల్లా "అయ్యా, బాబూ ఆకలి అవుతుంది. ఏం తినక రెండు రోజులయ్యింది. ఒక రూపాయి దానం చెయ్యండి బాబో, ఆకలి నన్ను దహించి వేస్తోంది" అని అడిగిన ప్రతిసారి ప్రతి ఒక్కడూ నన్నూ మీ లాగే ఎగాదిగా చూసి 'కాళ్ళూ చేతులూ మంచిగానే ఉన్నాయిగా ఏదైనా పని చేసుకొని బతకొచ్చుగా ఈ ముష్టోల్లు ఎప్పుడూ ఇంతే. అందుకే మనదేశం ఇలా తయారవుతుంది" అంటూ ఉపదేశాలు, ఉపన్యాసాలు ఇచ్చారే తప్ప నా పరిస్థితిని అర్థం చేసుకున్న వాడు ఒక్కడైనా లేడు" అంటూ రాజయ్య వేదనతో గుండెలో దాగి ఉన్న ఆవేదనను అగ్ని పర్వత లావాలా కక్కివేశాడు.

★ ★ ★

ఇదంతా విన్న పరంధామయ్యకి కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి. సాటి మనిషి కష్టాలను చూస్తే చాలు ఎందుకో తట్టుకోలేని మనస్తత్వం తనది. అయినా కనిపించని ఓపికను తెచ్చుకొని "అవును రాజయ్యా ప్రభుత్వం కరువు ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం కోసం అనేక పథకాలు పెట్టింది కదా! నీకేం సాయం అందలేదా మరి" అన్నాడు పరంధామయ్య.

సాయమా! మాకా! చస్తూంటే చూసే సర్కారు బాబూ ఇది. ఇప్పుడేకాదు. ఎప్పుడూ మాకు ఈ ప్రభుత్వంతో ఒరిగింది, జరిగిందేదీ లేదు. మా ఊరి పోశాలు గాడి అన్న సాయిలు పత్తి పంటకు సరైన ధర రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక, పరువు పోయినంక ప్రాణముండి ఎందుకని ఆత్మహత్య చేసుకుంటే సంతాపం తెలియజేసింన్రు కానీ సాయం మాత్రం చెయ్యలేదు. ఏ అధికారి కూడా సారూ.... అసలు వాడు పత్తి రైతే కాదని, మతి స్థిమితం లేక పురుగుల మందు తాగి చనిపోయాడని సర్టిఫికెట్ ఇచ్చింది సారూ ఈ గవర్నమెంటు.. ఇటువంటి సర్కారు మాకు కరువొచ్చిందని సాయం కూడా చేస్తదా సారూ" అన్నాడు రాజయ్య.

నిర్ఘాంతపోయిన పరంధామయ్యకు ఏం చెప్పాలో పాలుపోక

''మరి పత్రికల్లో ప్రకటనలు, హంగులు, ఆర్భాటాలు బాగానే వస్తున్నాయి కదా" అన్నాడు.



అనలు సర్కారోళ్ళ హడావుడి ప్రకటనలు పత్రికల్లో రానిది ఎప్పుడు బాబుగారూ? ఎలక్షన్లకు ముందటి నుంచి పేదలను ఆదుకుంటానని, రైతులకు రుణాలిస్తానని, యువతకు ఉపాధి కల్పిస్తామని, విద్యావైద్యం అందరికీ అందేలా చూస్తామని'' ఎలక్షన్లు అయిపోయి గెలిచే దాకా ఢంకా మ్రోగించినట్లు చెప్పిరి. గెలిచిన తరువాత ఏమయ్యింది. ఒక్కడన్న మళ్ళీ మా పల్లెకు వచ్చిన పాపాన పోలేదు. ఏమన్న ఏ మంత్రి అయిన వస్తే మండలం దాకా వచ్చి ఓ పార పట్టుకొనో, ఓ తట్ట పట్టుకొనో పత్రికలకు ఓ ఫొటో ఫోజిచ్చి వెంటనే వెళ్ళిపోతారుసారూ" అంటూ ఆవేదనతో ఊగిపోయాడు.

అవకాశంకోసం ఎదురు చూసిన వాడిలా పరంధామయ్య "మరి మీ గ్రామస్థులంతా కలిసి ఆ మండలం కాడికే పోయి నిలదీయక పోయారా!" అని ప్రశ్నించాడు.

అలా కూడా ఓసారి చేశాము బాబూ. కరెంటు కోత వల్ల పంటలకు నీరు పెట్టలేకపోతున్నాము. వచ్చిపోయే కరెంటు కారణంగా మోటార్లు కాలిపోతున్నాయి. అలాగే ప్రభుత్వం విడుదల చేసిన పనికి ఆహార పథకం బియ్యాన్ని కూడా సక్రమంగా పంపిణీ చేయాలని మంత్రిగారిని మండలంలో నిలదీసిన కారణంగా ఖాకీ బట్టలోల్లను వ్యాన్‌ల నిండా దింపి పశువులను బాదినట్టుగా బాది, శాంతిభద్రతలకు భగ్నం కల్పించినందుకు చెయ్యి చేసుకున్నట్లు పత్రికల వాళ్ళకు చెప్పి వెళ్ళిపోయారు బాబుగారూ" అని నీరసంగా వివరించాడు రాజయ్య. నిత్యం పెరిగే ధరలు, మోయలేని భారాలు..., భరించలేని తన పిల్లల బడి ఫీజులు, అదుపులేని ఛార్జీలు ఇవన్నీ పరంధామయ్య రోజు పడుతున్న బాధలే అయినా ఆఫీసులో మాత్రం సహ ఉద్యోగుల మాటలు విని రాష్ట్రం అభివృద్ధి పథాన స్వర్ణాంధ్రగా మారిపోతున్నదని ఇన్ని రోజులూ పగటి కలలు కనే పరంధామయ్య, రాజయ్య మాటలకు శూన్యంలోకి చూస్తూ ఊహల ప్రపంచాన్ని వీడి నిజాలను వెదుకుతున్నాడు.

మౌనాన్ని కదిలించి మనసు తట్టి ఆలోచిస్తున్న పరంధామయ్యను కదిలించి సారూ... సారూ... అంటూ తట్టి పిలిచాడు. ఆలోచనల్లోంచి తేరుకుని రాజయ్య ముందుకువచ్చిన పరంధామయ్య "మరీ ఈ చెమటలేమిటి రాజయ్యా" అంటూ అడిగాడు." ఏ మాట్లాడాలో తోచక "బాబుగారు భోజనం చేయక రెండు రోజులు దాటింది'' అని అన్నాడు రాజయ్య.

కన్నీటి కథ విన్నాక కరిగిన మనసుతో జేబులో చెయ్యి పెట్టి విశాల హృదయంతో "ప్రాణాలు కోల్పోతున్నప్పుడు పైసలు ఒక్క లెక్కా" అనుకొని ఓ పది రూపాయల నోటు తీసి ఇదిగో రాజయ్యా ఏమైనా తిను" అని బాధాతప్త హృదయంతో ప్రభుత్వ ఆఫీసు వైపు అడుగులు వేస్తూ అక్కడి నుండి నిష్క్రమించాడు పరంధామయ్య.

సాటి మనిషి కష్టాలను అర్థం చేసుకునే మనుషులు ఇంకా ఉండబట్టే నాలాంటి అభాగ్యులు బతక కలుగుతున్నారని మనస్సులోనే పరంధామయ్యకు కృతజ్ఞతలు తెలియజేశాడు రాజయ్య. ఆవురావురుమంటున్న ఆకలికి పేగులు పెట్టే గోలకు కళ్లెం వేయాలని వెంటనే పక్కనే ఉన్న ఇడ్లీ బండీ కాడికి పోయి ఒక ప్లేటు ఇడ్లీ కొనుక్కొనితింటూ "ఇక్కడ నా పరిస్థితి ఇంత ఘోరంగా ఉంది. ఇంటికాడ ఉన్న నూకలు అయిపోయి భార్య పిల్లలు ఎన్ని కష్టాలు పడుతున్నారో ఏమో అని అనలేక తింటూ ఉండగా"అయ్యా ఆకలైతుంది కొంచెం పెట్టవా" అంటూ చెయ్యి చాపిన కుర్రాణ్ని చూడగానే మదిలో మెదిలిన పిల్లలు ఈ కుర్రాణి రూపంలో కళ్ళముందు కదిలినట్లు అనిపించి తనుతింటున్న ఇడ్లీల నుండి ఒకటి తీసి చేతిలో పెట్టి ఆ కుర్రాడిని అలాగే చూస్తుంటే కంటి నుండి రాలిన కన్నీటి చుక్కలు నేలపైన రాలిపడసాగాయి..

పరిపూర్ణ నటుడు 'బళ్ళారి రాఘవ'

ఆంధ్రనాటకరంగం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన 'బళ్ళారి రాఘవ' గురించి వివరిస్తుందీ పుస్తకం. చిన్న పుస్తకమే అయినా రాఘవ జీవితంలోని ముఖ్యమైన అంశాలన్నింటినీ ప్రస్తావించారు. నాటకరంగం గురించి రాఘవ నిరంతరం ఎలా తపన పడేవారో రచయిత ఉదహరించిన అనేక అంశాలను చదివితే అర్థమవుతుంది. ముఖ్యంగా రాఘవ విదేశీ పర్యటన, స్త్రీ పాత్రలను స్త్రీల చేతే ధరింపచేయడానికి ఆయన చేసిన కృషి ఆసక్తి కలిగిస్తాయి. సహజ నటన, సమయస్ఫూర్తి గురించి రచయిత ఇచ్చిన ఉదాహరణలు ఆయనలోని పరిపూర్ణ నటుడిని ఆవిష్కరింప చేస్తాయి. రాఘవ జ్ఞాపకశక్తి కూడా అమోఘం. సహనటుడు ఒకరు రాకపోయినా ఆ పాత్ర డైలాగులను మేకప్ వేసుకుంటూనే చదివించుకొని ఆ తర్వాత నటించే వారు. ఎక్కడా తొట్రుపాటుకు లోనవుతున్న వారు కాదు. రాఘవలోని మరో విశేష అంశం తనను నమ్ముకున్న కక్షిదారులకు అన్యాయం చేయకపోవడం. వృత్తిరీత్యా వకీలు అయిన రాఘవ, సాయంత్రానికి తానో న్యాయవాదినన్న విషయం గుర్తులేనట్లుగా కళాసేవలో మునిగి తేలేవారు.

రచన : జానమద్ది హనుమచ్ఛాస్త్రి వెల : రు.25/-, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

రాఘవ తనకు సంబంధించిన విశేషాలను ఎక్కడా రికార్డు చేయకపోవడం వల్లనూ, ఆయన సమకాలీనుల్లో ఎక్కువ మంది గతించడం వల్లనూ ఈ పుస్తకంలో ఆయన జీవితానికి సంబంధించిన అనేక పార్శ్వాలు కనిపించవు. సన్నివేశాల రూపంలోనే పుస్తకంలో ఎక్కువ భాగం సాగుతుంది. ముఖ్యంగా బాల్య జీవితం, ఆయన కుటుంబ విశేషాల ప్రస్తావన అంతగా లేదు. ఆయనతో పాటు నటించిన ఇతర నటీనటుల ఫొటోలను అందించడం బాగుంది. పౌరాణిక నాటకాల వల్ల పెద్దగా ప్రయోజనం లేదని సాంఘిక నాటకాలపై ఒకకాలంలో రాఘవ బాగా శ్రద్ధ వహిస్తారు. ఆ తరువాత ఆయన కొన్ని పౌరాణిక నాటకాల్లో నటిస్తారు. దీనిపై అప్పట్లోనే పెద్ద దుమారం చెలరేగింది. అనేక మంది రకరకాలుగా వ్యాఖ్యానించారు. రాఘవ నాటకరంగం నుండి సినిమాల్లోకి ఎలా ప్రవేశించింది, కొంతకాలం తర్వాత అక్కడ ఇమడలేక మళ్ళీ నాటకరంగానికి ఎలా వచ్చిందీ ఇందులో పొందుపర్చారు. ఆయన కొన్ని సభల్లో చేసిన ఉపన్యాసాలను కూడా యథాతథంగా ఇచ్చారు. రాఘవ నాటక రచన, రాఘవ అభినయించిన వివిధ నాటకాలు, నటించిన సినిమాలు, అందులో ఆయా పాత్రల పేర్లను వివరంగా అనుబంధంలో అందించారు. రాఘవ గురించి ఓ అవగాహనను తప్పకుండా కలిగిస్తుంది ఈ పుస్తకం.

-కె.కె.

సాంఘిక జీవిత దర్పణం

రచన : కందాడై శ్రీనివాసులు వెల : రు.20; ప్రతులకు : యు.టి.ఎఫ్.భవన్, ఖమ్మం, ప్రజాశక్తి బుక్‌హౌస్, ఖమ్మం.

వ్యక్తిత్వ వికాసం పేరిట, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పేరిట టన్నుల కొద్దీ పేజీలు అచ్చవుతున్న కాలమిది. రోజుకు ఒక పుస్తకమన్నా మార్కెట్‌లోకి విడుదలై పాఠకుల్ని గందరగోళ పరుస్తున్న సమయమిది. వ్యక్తిగా ఎలా ఎదగాలో, వ్యక్తిగా ధనాన్ని, కీర్తిని ఎలా సంపాదించాలో పనిగట్టుకొని మరీ దబాయించి రాస్తున్న కాలంలో ఒక వ్యక్తి సంఘజీవిగా ఎలా మసలాలో తెలియజెప్పే పుస్తకం 'మనలో మనం' రావడం ఒకింత ఆశ్చర్యకరమే. మనిషి వ్యక్తిగత జీవితం కన్నా సాంఘిక జీవితం ముఖ్యమని, సంఘంలో ఉన్నతుడిగా, ఆలోచనాపరుడిగా మసలాలంటే, మనగలగాలంటే 'వ్యక్తి స్వేచ్ఛ'ను కొంత అదుపులో ఉంచుకొని పరుల గురించి ఆలోచించమని తెలియజేస్తుందీ పుస్తకం. మారుతున్న కాలంలో పెరుగుతున్న జీవనవేగంలో పాత వ్యవస్థలోని విలువలు మారుతున్నాయి. కొత్త వ్యవస్థ నూతన విలువల్ని సంతరించుకోని సంధ్యాకాలంలో మనం ఉన్నాం. సమాజానికి, వ్యక్తికీ మధ్య ఉండే సంబంధాలలో అసాధారణమైన ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఒక పక్క ఆధ్యాత్మికతా సాహిత్యం, మరో పక్క మానసిక విశ్లేషణా సాహిత్యం ఊపందుకున్నాయి. అయితే అవి సాధారణ పాఠకుడికి కొరుకుడు పడకపోవచ్చు. అదేదో సుదూరమైన వేదాంతంగానూ, అర్థంగాని సైన్సుగానూ తోచవచ్చు. అలాంటి సందిగ్ధతకు పాఠకుడు గురికాకుండా నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక అంశాల్ని శాస్త్రీయంగా ఎలా విశ్లేషించుకోవాలో, జీవితానికి ఎలా అన్వయించుకోవాలో చిన్నచిన్న వ్యాసాల ద్వారా 'మనలో మనం' వివరించారు రచయిత కందాడై శ్రీనివాసులు. వృత్తిరీత్యా అధ్యాపకుడు కనుక పిల్లల సహజాతాల్ని పసిగట్టి పాఠం చెప్పినట్లుగానే పాఠకుల భావనల్ని ముందే పసిగట్టి అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ వ్యాసాల్ని రాశారు. ఇతరుల పట్ల మన ప్రవర్తన దగ్గరనుండి మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, మొహమాటాలు, జయాపజయాలు, సైన్సు, జ్యోతిష్యం, బాబాలు, పుణ్యం పురుషార్థం, హాస్యం, వంట, తాయెత్తులు ఇలా... మనిషి సాధారణ జీవితంలో నిత్యం ఎదుర్కొనే అంశాల గురించి మొత్తం 29 వ్యాసాలున్నాయి. పుస్తకంలో అన్నీ హాయిగా చదివిస్తాయి కూడా. అయితే వ్యాసాల శీర్షికలను మరింత ఆకర్షణీయంగా పెట్టడంలో రచయిత శ్రద్ధ వహిస్తే బాగుండేది. కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆర్థికాంశాలకు, బదిలీలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తాయనే అపప్రదని ఈ పుస్తకం ప్రచురించడం ద్వారా 'ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్' ఖమ్మం జిల్లా యూనిట్ అధిగమించింది. ఇలాంటి కృషిని చేపట్టినందుకు వారిని అభినందించకుండా ఉండలేం.

- తూములూరి

స్వీకారం



1990లో రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణాలో పోటెత్తిన భూపోరాటాల వెలుగులో ఆంధ్రప్రభ దినపత్రికలో అచ్చయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికసాంఘిక సమస్యలకు అసమ భూసంబంధాలే మౌలిక కారణం, భూమిలేని వ్యవసాయ కూలీలు పేద రైతాంగం భూమికోసం చేసిన పోరాటాలు, త్యాగాలు చరిత్ర పొడవునా కనిపిస్తాయి. భూమి సమస్యను పరిష్కరించేందుకు రైతాంగ ఉద్యమాలు ఏ ఏ దశల గుండా ఎట్లా పురోగమించింది ఈ వ్యాసంలో పరమేశ్వర్ విశ్లేషించారు.

భూపోరాటంలో వాస్తవాలు వక్రీకరణలు

రచన : పరమేశ్వర్; వెల : రూ. 10/-; ప్రతులకు : దిశపుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్



ఇందులో ఏడు అంశాలను గురించి ప్రస్తావించారు. 1956 నుంచి 2001 మధ్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని గురించి, ఆ క్రమంలో జరిగిన ప్రాంతీయ అసమానతలకు అధ్యయనం ఇందులో ఉంది.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - 1956-2001

ప్రాంతీయ అసమానతల అధ్యయనం

ఆంగ్లమూలం : వై.వి.కృష్ణారావు; తెలుగుసేత : ఆర్వీయార్; వెల : రూ. 12/-; ప్రతులకు విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



క్లిష్టమైన మానవ సంబంధాలను భౌతిక, మానసిక శాస్త్రాల నేపథ్యంలో శాస్త్రీయంగా వివరించేందుకు రచయిత ప్రయత్నించారు. కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా ఉండటానికి ఉపయుక్తంగా ఉండే సమాచారాన్ని ఇందులో చేర్చారు.

ఆడవారిని అర్థం చేసుకోడం ఎలా ?

రచన :అట్లూరి వెంకటేశ్వరరావు; వెల : రూ. 45/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు